పోలీసుల పేరిట వసూళ్లు చేస్తున్న ఇద్దరిపై కేసు

సంగారెడ్డి క్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కంది మండల పరిధిలోని 65వ నంబరు హైవేపై వాహనాలను ఆపి పోలీసుల పేరు చెప్పి వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రవీందర్ తెలిపారు. విశ్వసనీయ సమాచారంతో మంగళవారం పోలీసులు కంది వద్ద హైవేపైకి చేరుకోగా వసూళ్లకు పాల్పడుతున్న వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటకు చెందిన పద్మారావు, సంగారెడ్డికి చెందిన చాకలి గంగాను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన నిర్మలాజగ్గారెడ్డి


రికార్డ్ స్థాయిలో పెట్టుబడులు తెచ్చినందుకు శుభాకాంక్షలు తెలిపిన టీజీఐఐసీ చైర్‌పర్సన్


సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నిర్మలాజగ్గారెడ్డి


సీఎంతో పాటు మంత్రులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : దావోస్ నుంచి రికార్డు స్థాయిలో పెట్టుబడులు తెచ్చిన సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సన్మానించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, ఎంపీ అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు.

పిచ్చికుక్క దాడిలో 14 మందికి గాయాలు



కంగ్టిలో పిచ్చికుక్క దాడిలో యువకుడికి అయిన గాయాలు

కంగ్టి, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : పిచ్చికుక్క దాడిలో సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన కంగ్టితో పాటు పలు గ్రామాల్లో 14 మందికి గాయాలైన సంఘటన మంగళవారం చోటుచేసుకున్నది. కంగ్టిలోనే తొమ్మిది మందిపై పిచ్చికుక్క దాడి చేసి గాయపర్చింది. కంగ్టిలో అనిల్(30), స్వామిదాస్(7), శ్రీకాంత్‌రెడ్డి(26), శివరాజ్(26), ఉమేష్(30), సుభాష్(45), సిద్ధారెడ్డి(65), బీమప్ప(55), నితిన్(15)కు గాయాలు కాగా, స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. పంచమహల్ దామరగిద్దలో విష్ణు(38), పీరమ్మ(45), బోర్గిలో పండరినాథ్‌రావు, వాసర్‌లో లక్ష్మి(38), మరొకరు కుక్కల దాడిలో గాయపడ్డారు.

అమ్మో వీధి కుక్కలు

కంగ్టి మండలంలోని గ్రామాలు, తండాల్లో వీధి కుక్కల బెడద రోజురోజుకూ తీవ్రమౌతుంది. అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఉన్నతాధికారలు పేర్కొంటున్నప్పటికీ, ఆచరణలో విఫలమవుతున్నారు. స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గతేడాది ఆగస్టులో వీధికుక్కల లెక్కలు తీశారు. మండలంలో మొత్తం 2230 కుక్కలు ఉండగా, వీటిలో 921 మగ కుక్కలు, 828 ఆడ కుక్కలు. కానీ తండాల్లోని కుక్కల సంఖ్యను కలుపుకుంటే అదనంగా మరో 15వందల కుక్కలు ఉంటాయి. కుక్కల లెక్కలు తీసి ఆరు నెలలవుతున్నా వీటిని అరికట్టే దిశగా ఒక్క అడుగు ముందుకు పడలేదు. ఇటీవల గ్రామాల్లో మనుషులపైనే కాకుండా పశువులపైన దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. వారం రోజుల క్రితం రైతుకు చెందిన 18 మేక పిల్లలను కుక్కలు చంపేశాయి.

అందోలు-జోగిపేటలో నవోదయ విద్యాలయం

- బీఫార్మసీ కళాశాల ఏర్పాటు
- రెండు మైనారిటీ గురుకులాలు, జ్యోతిబాపూలే పాఠశాలకు భవనాల నిర్మాణం
- పట్టణాన్ని విద్యాకేంద్రంగా తీర్చిదిద్దుతా
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ


నవోదయ పాఠశాల కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి

జోగిపేట, జనవరి28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు మంజూరైన జవహర్ నవోదయ విద్యాలయాన్ని అందోలు-జోగిపేట పట్టణ పరిధిలో ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు. మంగళవారం ఆయన అందోలులోని 1141 సర్వే నంబర్‌లో స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అందోలులోనే బీఫార్మసీ కళాశాలనూ ఏర్పాటు చేస్తామన్నారు. ఇదే సర్వే నంబరులో ఉన్న స్థలంలోనే జోగిపేటలో కొనసాగుతున్న బాలికలు, బాలుర మైనారిటీ పాఠశాలలకు, సంగారెడ్డిలో కొనసాగుతున్న జ్యోతిబాపూలే పాఠశాలలకు సొంత భవనాలను నిర్మించనున్నామని తెలిపారు. అందోలు-జోగిపేట మున్సిపాలిటీని విద్యాకేంద్రంగా తీర్చిదిద్దుతానన్నారు. గతంలో తాను విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు జంట పట్టణాల్లో రెండు పాలిటెక్నిక్ కళాశాలలు, ఉస్మానియా యూనివర్సిటీ పీజీ కళాలశాల, మహిళా డిగ్రీ కాలేజీని స్థాపించానని గుర్తుచేశారు. ప్రస్తుతం నర్సింగ్ కాలేజీని ఏర్పాటు చేశానన్నారు. జంట పట్టణాల మధ్య ఉన్న పెద్దచెరువు(రంగనాయక సాగర్)ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానని మంత్రి హామీ ఇచ్చారు. మంగళవారం ఆయన అందోలు చెరువు కట్టను సందర్శించారు. మినీట్యాంక్‌బండ్ పనుల మాస్టర్‌ప్లాన్‌ను పరిశీలించి, మార్పులుచేర్పులను అధికారులకు సూచించారు. మంత్రి వెంట రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మక్త జగన్మోహన్‌రెడ్డి, ఆర్డీవో పాండు, మున్సిపల్ కమిషనర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నవోదయ పాఠశాలను ఖేడ్‌లోనే ఏర్పాటు చేయాలి

- నియోజకవర్గవాసుల డిమాండ్
- ఇప్పటికే కేంద్ర విద్యాశాఖ మంత్రి జయంత్‌చౌదరికి జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ వినతి

7


భక్తుల పుణ్యస్నానాల కోసం ఏడుపాయల వద్ద షవర్ల ఏర్పాటు

మాఘ అమావాస్య స్నానం.. సర్వపాపహరణం

- మంజీర నదిలో పుణ్య స్నానాలకు ఏర్పాట్లు
- సింగూరు నుంచి నీటి విడుదలతో జలకళ

7

పథకాలు.. అనర్హులకు

సంక్షేమ పథకాల జాబితాలో శ్రీమంతులు | ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎంపికపై విమర్శలు

- ప్రభుత్వ ఉద్యోగులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు
- ఎన్ఆర్ఐ కుటుంబాలకు, ఇంటర్ విద్యార్థులకు ఆత్మీయ భరోసా
- భూములు, భవంతులు, ఉద్యోగాలు ఉన్నా రేషన్‌కార్డులు


ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా జాబితాలో పేర్లు లేవని బెజ్జంకి మండలం వీరాపూర్‌కు చెందిన మహిళల నిరసన

మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం ఐబీ గిరిజన తండాలో సర్కారు ఉద్యోగి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఇంటర్ చదువుతున్న ఓ విద్యార్థినికి ఆత్మీయ భరోసా అందింది. పెళ్లికాని ముగ్గురు అమ్మాయిలకూ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాలో చోటు దక్కింది. మంజూరు పత్రాలు కూడా తీసుకున్నారు.

సంగారెడ్డి జిల్లా చెర్ల గోపులారంనకు చెందిన ఓ వ్యక్తి పేరిట దాదాపు 20 ఎకరాల సాగుభూమి, భవంతులు ఉన్నాయి. ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో ఈ వ్యక్తికి చోటు దక్కింది. ఇక అమెరికాలో ఉంటున్న ఓ వ్యక్తి కుటుంబ సభ్యులనూ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి ఎంపిక చేశారు.

సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణానికి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడికి ఇందిరమ్మ ఇల్లు, మరొకరికి రేషన్‌కార్డు జాబితాలో పేర్లు వచ్చాయి. ఇదే మండలం పెద్దరాజుపేట గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు రేషన్‌కార్డులు మంజూరైనట్లుగా గ్రామసభల్లో చదివి వినిపించారు. దౌల్తాబాద్ మండలం ముబారస్‌పూర్‌లో జాబ్‌కార్డులు లేనివారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, వ్యవసాయ భూములు ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేర్లు వచ్చాయి. అనర్హుల ఎంపికపై గ్రామానికి చెందినవారు అధికారులను నిలదీశారు.

ఉమ్మడి జిల్లాల్లో సంక్షేమ పథకాల అర్హులు ఇలా ఉన్నారు. నాలుగు రోజుల పాటు అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేసినా పథకాల ప్రారంభోత్సవం రోజునే అనర్హులకు దక్కాయి. ఇంత కసరత్తు చేసి మండలానికి ఒక గ్రామంలో మంజూరు పత్రాలను ఇస్తేనే అనర్హులకు అందాయంటే, పూర్తిస్థాయిలో పథకాలు అమలైతే పరిస్థితి ఏంటో చూడాలి.


ఆత్మీయ భరోసాలో అనర్హుల పేర్లున్నాయని ఫిర్యాదు చేస్తున్న కంది మండలం మత్తలల్లూరు గ్రామస్థులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 28 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు పొందేవారిలో అనర్హులు తేలుతున్నారు. రాష్ట్ర నేతల దగ్గరి నుంచి గ్రామ నాయకుల వరకు, ఉన్నతాధికారి నుంచి జిల్లా అధికారుల వరకు అర్హులకే పథకాలను అందజేస్తామని పదేపదే చెప్పారు. కానీ పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన గ్రామాల్లోనూ అనర్హులకే మంజూరు పత్రాలు చేరాయి. ఈ ప్రాతిపదికన అర్హుల ఎంపిక ఎలా జరిగిందోనని అయోమయం నెలకొంది. అర్హుల ఎంపికపై నిర్వహించిన గ్రామసభల్లో అనర్హులపై వివాదాలు తలెత్తిన విషయం తెలిసిందే. అయినప్పటికీ క్షేత్రస్థాయి పరిశీలన చేస్తామని, అర్హులకే లబ్ధి చేకూరుతుందని అధికారులు చెప్పుకొచ్చారు.

తండ్రుల పేరిట భూములు.. కుమారులకు ఆత్మీయ భరోసా

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ప్రతీఏటా రూ.12వేల సహాయం అందుతుంది. ఉపాధిహామీకి సంబంధించిన జాబ్‌కార్డు ఉండడంతోపాటు కనీసం 20 రోజుల పనిదినాలు చేసి ఉండాలి. ఇందులోనూ భూమిలేని నిరుపేదలకు తొలి ప్రాధాన్యతగా భరోసా డబ్బులు ఇవ్వాలి. కానీ సొంత ఇల్లు, భవంతులు ఉన్నవారికి చాలాచోట్ల భరోసా అందింది. తండ్రుల పేరిట ఎకరాల కొద్దీ భూములు మిగతా 7వ పేజీలో

మూడు జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుకు ఎంపికైన గ్రామాల్లో పథకాల లబ్ధిదారుల వివరాలు

నియోజకవర్గం	గ్రామాలు	ఇందిరమ్మ ఇళ్లు	ఆత్మీయ భరోసా
జహీరాబాద్	5	1,027	356
దుబ్బాక	7	984	174
నర్సాపూర్	8	675	277
మెదక్	6	565	202
సంగారెడ్డి	4	528	124
అందోలు	8	11,95	119
గజ్వేల్	9	833	247
సిద్దిపేట	5	544	126
పటాన్‌చెరు	4	213	22
నారాయణఖేడ్	7	900	249
హుస్నాబాద్	7	910	207

కార్యాలయానికి రావొద్దు

- వార్డు అధికారిగా మరొకరికి బాధ్యతలు
- మెదక్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మెదక్ మున్సిపాలిటీలో మహిళా ఉద్యోగి స్థానంలో నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వహిస్తున్న ఆమె కుమారుడిని కార్యాలయానికి రావొద్దని కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. 'ఒకరి స్థానంలో మరొకరు విధుల్లో' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి మున్సిపల్ కమిషనర్ స్పందించారు. ఈ విషయమై కమిషనర్ మాట్లాడుతూ విధుల్లోకి రావొద్దని ఆదేశించామని, మున్సిపల్ ఉద్యోగి షమీన్ ఫాతిమా హాజరుకావాల్సిందేనని తెలిపారు. అంతేగాకుండా వారి స్థానంలో మరో వార్డు అధికారిని నియమించినట్లు చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో ఇలా పనిచేసే అందరిని పిలిపించి, వారి ఆరోగ్య పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి కలెక్టర్‌కు జాబితా పంపుతామని వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా మరోసారి విధులు కేటాయించకూడదని సిబ్బందికి సూచించామన్నారు. మరోసారి అలసత్వంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.

మనోవేదనలో విశ్రాంత ఉద్యోగులు

- ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరించాలి
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు తదితరులు

మెదక్ అర్బన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : విశ్రాంత ఉద్యోగులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాక ఎంతో మనోవేదనకు గురువుతున్నారని, వారి పట్ల ప్రభుత్వం కనికరంతో వ్యహరించాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు కోరారు. మంగళవారం మెదక్ పట్టణంలోని టీఎన్జీవో భవన్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ అధ్యక్షతన నిర్వహించిన స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం, డెయిరీ, క్యాలెండర్ ఆవిష్కరణకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్, టీఎన్జీవో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దేవిప్రసాద్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ ఉద్యోగుల వయోపరిమితి పెంపుపై ఊహానాగాలు వస్తున్నాయని, తక్షణమే ఆ ఆలోచనలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలన్నారు. ఉద్యోగులకు, జర్నలిస్టులకు హెల్త్ కార్డు ద్వారా వైద్యం అందించాలన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఉద్యోగి పదవీ విరమణ చేసిన వారికి రావాల్సిన బెనిఫిట్స్‌ను 30 రోజుల్లో చెల్లించాలన్నారు. యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్‌పై సలహాలు, సూచనలను, ఆదాయపు పన్ను పరిమితి వంటి అంశాలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని ఎంపీ హామీ ఇచ్చారు. టీఎన్జీవో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దేవిప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమమే కాకుండా ప్రజల ఆశయాలు, ఆకాంక్షల మేరకు పోరాడిన ఏకైక సంఘం టీఎన్జీవో అన్నారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ మాట్లాడుతూ మెదక్ జిల్లాను రాజన్న జోన్ నుంచి చార్మినార్ జోన్‌కు మార్చాలని, ఈఎన్‌సీ ఇరిగేషన్ గజ్వేల్ యూనిట్ నుంచి నీటి పారుదల శాఖ సర్కిల్ కార్యాలయాన్ని సంగారెడ్డికి, జిల్లా నుంచి సిద్దిపేట జిల్లాకు తరలిస్తున్న ఫారెస్టు చీఫ్ కన్జర్వేటర్ కార్యాలయాన్ని తిరిగి వెనక్కు తేవాలని మూడు తీర్మానాలను, రాష్ట్ర స్థాయికి సంబంధించి మరో ఏడు తీర్మానాలను ఆమోదించామన్నారు. అనంతరం టీఎన్జీవో సంఘం డెయిరీ, నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనురాధ, జిల్లా సహాఅధ్యక్షులు ఇక్బాల్ పాష, కోశాధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాటకు మాట

కార్యక్రమంలో ముందుగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతీ నెల జీతాలు సరిగ్గా రావడం లేదని, కొంతమందికి నవంబర్ నుంచి ఇవ్వలేదని, మరికొందరికేమో ఒకటో తేదీన జీతం పడుతుందని విమర్శలు చేశారు. ప్రభుత్వ తీరుతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ తనకు ప్రతీ నెల ఒకటో తేదీనే ఖాతాలో వేతనం పడుతుందని, ఉద్యోగులకు కూడా ప్రభుత్వం జీతం అందజేస్తుందన్నారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలకు ప్రతీగానే కలెక్టర్ మాట్లాడారని ఉద్యోగుల్లో గుసగులు వినిపించాయి.

54 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

- ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మార్చి 5 నుంచి 25 వరకు జరుగునున్న ఇంటర్మీడియేట్ పరీక్షల కోసం సంగారెడ్డి జిల్లాలో 54 కేంద్రాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో మంగళవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. మొత్తం 18,488 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్టు కలెక్టర్ వెల్లడించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కేంద్రాల వద్ద తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, టాయిలెట్‌లను పరిసరాలు శుభ్రంగా ఉండేలా పంచాయతీ, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్డీవోలు సంబంధిత అధికారులతో సమావేశాలు నిర్వహించి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా బస్సు సర్వీసులను నడిచేలా ఆర్టీసీ చర్యలు తీసుకోవాలన్నారు. ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు నిర్వహించనున్న ప్రాక్టికల్స్ పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఇంటర్మీడియేట్ అధికారి గోవిందరామ్, డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

జగదేవ్‌పూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని ఐసీడీఎస్ అధికారులు హెచ్చరించారు. మంగళవారం జగదేవ్‌పూర్ మండలంలోని ఇటిక్యాల గ్రామంలో బాల్య వివాహం జరుగుతుందని తెలుసుకున్న అధికారులు అక్కడికి వెళ్లి కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. బాలికల పెళ్లికి సహకరించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారులు, షీటీం బృందం, ఆర్ఐ, చైల్డ్ లైన్ ప్రతినిదులు పాల్గొన్నారు.

ఎనిమిదేళ్ల వయస్సులోనే కిలిమంజారోపైకి..

● పర్వతారోహకుడికి గవర్నర్ ప్రశంస


విహన్‌రామ్‌ని అభినందిస్తున్న గవర్నర్

ధూళిమిట్ట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలం హనుమతండా గ్రామానికి చెందిన చెందిన బాలుడు జాటోత్ విహన్‌రామ్(8) గతవారం ఆఫ్రికా దేశంలోని అత్యంత ఎత్తైన కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించాడు. చిన్న వయస్సులో పలు ఎత్తైన పర్వతాలను అధిరోహిస్తున్న బాలుడిని మంగళవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాజ్‌భవన్‌కు పిలిపించుకుని అభినందించారు. ఈ సందర్భంగా విహన్‌రామ్ తాను వచ్చే నెలలో ఆస్ట్రేలియాలోని కోషియాస్కో పర్వతాన్ని అధిరోహించనున్నట్లు తెలిపారు. బాలుడి తండ్రి తిరుపతినాయక్ అబ్కారీశాఖలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. కార్యక్రమంలో బాలుడి కోచ్ మహిపాల్ రెడ్డి, తల్లితండ్రులు వాణి, తిరుపతి నాయక్, స్పాన్సర్ గుగులోత్ రజిత, తదితరులు పాల్గొన్నారు.

స్క్రాప్ దుకాణంలో అగ్ని ప్రమాదం

● రూ.5 లక్షల నష్టం


దగ్ధమవుతున్న స్క్రాప్ దుకాణం

నారాయణఖేడ్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఖేడ్ పట్టణంలోని చంద్రయ్యకు చెందిన పాత ఇనుప సామగ్రి(స్క్రాప్) దుకాణంలో మంగళవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గమనించిన స్థానికులు యజమానికి చెప్పడంతో ఆయన అక్కడికి చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో వచ్చి మంటలు ఆర్పేలోగా సామగ్రి మొత్తం కాలిపోయి జరుగాల్సిన నష్టంజరిగింది. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. బాధితుడు ఫిర్యాదుతో డిప్యూటీ తహసీల్దార్ రాజుపటేల్ సందర్శించి పంచనామ నిర్వహించారు. రూ.5 లక్షల వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

రావి ఆకులపై పద్మ అవార్డు గ్రహీతల చిత్రాలు

నారాయణఖేడ్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పద్మ అవార్డు గ్రహీతలకు వినూత్నంగా శుభాకాంక్షలు తెలిపాడు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్టు గుండు శివకుమార్. రావి ఆకులపై అవార్డుల గ్రహీతలైన డాక్టర్ దువ్వూరి నాగేశ్వర్‌రెడ్డి, నందమూరి బాలకృష్ణ, మందకృష్ణ మాదిగల చిత్రాలను చిత్రాలు వేసి శుభాకాంక్షలు తెలిపారు.



మాఘ అమావాస్య స్నానం..
సర్వపాపహరణం



కూడవెల్లి రామలింగేశ్వరస్వామి ఉత్సవాలు

- ముస్తాబైన ఆలయాలు
- నేటి నుంచి కూడవెల్లి రామలింగేశ్వరస్వామి ఉత్సవాలు

దుబ్బాక, జనవరి28(ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా పేరొందిన అక్బర్‌పేట- భూంపల్లి మండలం రామేశ్వరంపల్లిలోని కూడవెల్లి రామలింగేశ్వరాలయం మాఘ అమావాస్య జాతరకు ముస్తాబైంది. మంగళవారం దేవుడి ఊరేగింపుతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. బుధవారం మాఘ అమావాస్యను పురస్కరించుకుని కూడవెల్లివాగులో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించనున్నారు. ఇందుకోసం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చొరవతో మల్లన్నసాగర్ ద్వారా నీటిని కూడా విడుదల చేశారు. వాగులో నీటి నిల్వతో దేవాలయం చుట్టూ పర్యాటక శోభ సంతరించుకున్నది. తూర్పు నుంచి పెద్దవాగు, పడమర నుంచి చిన్నవాగు, మధ్య వాగులతో అనుసంధానంగా కలయికతో ఏర్పడిన కూడవెల్లి వాగులో మాఘ అమావాస్య రోజున పుణ్యస్నానం ఆచరిస్తే పాపాలు హరిస్తాయని భక్తుల నమ్మకం. వాగులో స్నానాలు ఆచరించే సమయంలో ప్రమాదాలు సంభవించకుండా అన్నీ ఏర్పాటు చేశారు.

ఏడుపాయలలో..

పాపన్నపేట : మాఘ అమావాస్య ఉత్సవాలకు ఏడుపాయల సిద్ధమవుతున్నది. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని ఏడుపాయలుగా చీలిన మంజీర నదిలో పుణ్య స్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకోవడం ప్రజల ఆనవాయితీ. భక్తులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా అన్నీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఈవో, మెదక్ జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రావు మంగళవారం పేర్కొన్నారు. చెక్‌డ్యాం, అమ్మవారి ఆలయం వద్ద షవర్లు, బట్టలు మార్చుకోవడానికి తాత్కాలిక గదులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మెదక్ డీఎస్పీ పర్యవేక్షణలో 231 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు.

కొప్పోల్ ఆలయంలో..

పెద్దశంకరంపేట : మాఘ అమావాస్య ని పురస్కరించుకొని పెద్దశంకరంపేటమండల పరిధిలోని శ్రీ కొప్పోల్ ఉమా సంగమేశ్వర దేవాలయం సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయ కోనేటిలో పవిత్ర స్నానాల ఆచరించిస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

ముస్తాబైన 'కొడకంచి'

జిన్నారం, జనవరి, 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడకంచిలో ఆదినారయణ స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలకు మస్తాబైంది. శ్రీదేవి, భూదేవి సమేతంగా వెలిసిన ఆదినారయణుడి ఉత్సవాలను ఫిబ్రవరి 1నుంచి 10 వరకు వరకు నిర్వహించనున్నారు.ఇక్కడున్న బంగారు బల్లుల విగ్రహాలు అతి ముఖ్యమైనవి. తమిళనాడులోని కంచిలోని బంగారు బల్లుల తరహాలో ఈ ఆలయం లోపల వీటిని ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో ముఖ్య ముఖ్యఘట్టాలైన స్వామి వారి కల్యాణోత్సవం 4న, రథోత్సవం 8న, 10న ఉత్సవాల ముగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కాగా బ్రహ్మోత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ అల్లాని రామాజీ రావు తెలిపారు.

నేడే గుబ్బడి గుట్ట జాతర

నంగునూరు : మాఘ అమావాస్య రోజున పాలమాకులలో జరిగే గుబ్బడి గుట్ట జాతరకు దత్తాత్రేయుని ఆలయం ముస్తాబైంది. నాలుగు గ్రామాల శివారులో ఉన్న ఆలయాన్ని సంవత్సరానికి ఒకరోజు మాత్రమే తెరిచి సాయంత్రం మూసివేయడం ఇక్కడి ప్రత్యేకత. ఆలయ ప్రాంగణంలో హరి నామం ఆకారంలో వెలసిన పవిత్ర గుండంలో స్నానం చేసి స్వామిని దర్శనం చేసుకుంటే పీడ బాధలు తొలుగుతాయని గ్రామస్థుల నమ్మకం.

రేపటి నుంచి..

చేర్యాల : చేర్యాల మండలం చుంచనకోట గ్రామంలోని నారసింహీ గురుస్థానం భువనేశ్వరీ మందిరం అత్యంత మహిమాన్విత క్షేత్రంగా అలరారుతుంది. ఏటా మాఘశుద్ధ పాడ్యమిని పురస్కరించుకుని శైశిర మాఘ నవరాత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ నేపథ్యంలో రేపటినుంచి 11రోజుల పాటు ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి. అన్నీ ఏర్పాట్లు చేపట్టినట్లు నిర్వహకులు తెలిపారు.

కేసీఆర్‌కు ప్రజలు వీఆర్ఎస్ ఇచ్చారు

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి ముఖం చాటేసిన బీఆర్ఎస్
- పోటీ విషయంపై కేసీఆర్, కేటీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలి
- గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఖర్చు రూ.50 కోట్లు..!
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



మాట్లాడుతున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్, కేసీఆర్‌కు వీఆర్ఎస్ ఇచ్చారని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఎద్దేవా చేశారు. మంగళవారం మెదక్ టీఎన్జీవో భవన్ వద్ద ఆయన మాట్లాడుతూ.. ఉద్యమ గడ్డ కేసీఆర్ సొంత మెదక్ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకొని ముఖం చాటేసిందని బీఆర్ఎస్‌పై ఆయన సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణ ఉద్యమాన్ని, టీఎన్జీవో ఉద్యమాన్ని బాగా నడిపించామని, బీఆర్ఎస్ నేతలు గొప్పలు చెబుతున్నారని, చివరికి ఎన్నికల్లో పోటీ చేసేందుకు సొంత జిల్లాలో కేసీఆర్‌కు ఒక్క అభ్యర్థి కూడా లేకుండా పోయాడా అని ప్రశ్నించారు. ఇటీవల జరిగిన వరంగల్, ఖమ్మం, నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పక్క పార్టీ వ్యక్తిని బీఆర్ఎస్ అభ్యర్థిగా నిలిపిందని, ఆయనను గెలిపించేందుకు రూ. 50 కోట్లు ఖర్చు పెట్టి, నియోజకవర్గానికి ఒక ఎమ్మెల్యేను ఇన్‌చార్జిగా పెట్టినా దిక్కు లేకుండా పోయిందని విమర్శించారు. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీ తోక ముడిచిందని, సొంత జిల్లాలో పోటీ నుంచి ఎందుకు తప్పుకున్నారో ప్రజలకు కేసీఆర్, యువరాజు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దేవీప్రసాద్ లాంటి వ్యక్తికి ఎమ్మెల్సీ టికెట్ ఎందుకు ఇవ్వరని ఆయన నిలదీశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీకి దూరంగా ఉండటమే రాష్ట్రంలో ఆ పార్టీ పని అయిపోందనవడానికి నిదర్శనమన్నారు. విద్యావేత్తలు, మేధావులు ఎప్పుడు బీజేపీ పక్షాన ఉంటారని, పోటీకి బీఆర్ఎస్ తోక ముడవడంతో మూడు స్థానాల్లో బీజేపీ విజయం నల్లేరు మీద నడకేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

నవోదయ పాఠశాలను ఖేడ్‌లోనే ఏర్పాటు చేయాలి

నారాయణఖేడ్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సంగారెడ్డి జిల్లాకు నూతనంగా మంజూరు చేసిన జవహర్ నవోదయ పాఠశాలను జిల్లాలోనే అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్న నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రానికి 9 పాఠశాలలను కేంద్రం మంజూరు చేసింది. ఇందులో ఒకటి సంగారెడ్డి జిల్లాకు కేటాయించగా, ఖేడ్ నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని ఇప్పటికే జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ కేంద్ర విద్యాశాఖ మంత్రి జయంత్‌చౌదరిని స్వయంగా కలిసి విన్నవించారు. స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి కూడా పాఠశాల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కూడా అప్పగిస్తామని చెప్పారు. ఆందోల్ నియోజకవర్గంలో జేఎన్‌టీయూ కళాశాల, సంగారెడ్డిలో ఐఐటీ, పటాన్‌చెరులో పలు ఇంజనీరింగ్ కళాశాలలు, జహీరాబాద్ కేవీ, ఇతర కాలేజీలు ఉన్నాయని, నారాయణఖేడ్‌లో పెద్దగా విద్యాసంస్థలు లేనందున నవోదయ పాఠశాలను ఏర్పాటు చేయించాలని ఈ ప్రాంత ప్రజలు, ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు.



కేంద్ర విద్యాశాఖ మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్(ఫైల్)



ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

బోనమెత్తి... శిగాలూగుతూ..

- కొండపోచమ్మ ఆలయంలో భక్తుల సందడి



జగదేవ్‌పూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపోచమ్మ జాతర గతవారం ప్రారంభం కాగా, ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. మంగళవారం వేలమంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించడంతో ఆలయ ప్రాంగణం అమ్మవారి నామస్మరణతో మారుమోగింది. కొత్త కుండలో నైవేద్యం వండి బోనాన్ని చక్కగా అలకరించారు. అనంతరం మహిళలు బోనాలను నెత్తిన ఎత్తుకుని డప్పుచప్పుళ్ల మధ్య నాట్యం చేస్తూ ఊరేగింపుగా అమ్మవారి చెంతకు తీసుకెళ్లి నైవేద్యాన్ని సమర్పించారు. అలాగే తల్లి పోచమ్మకు ఒడిబియ్యం పోయడానికి భక్తులు పోటీపడ్డారు. తొట్టెల కలగాలని భక్తులు అమ్మవారి గుడి పక్కన ఉన్న చెట్టుకు తొట్టెల కట్టారు. వేలాది మంది భక్తులు ముడుపులు కట్టారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు.

గీతంలో కంటెంట్ రైటింగ్ వర్క్‌షాప్ ప్రారంభం



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

పటాన్‌చెరు రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్‌హెచ్‌ఎస్)లో మంగళవారం 'కంటెంట్ రైటింగ్ వర్క్‌షాప్'ను ప్రారంభించారు. మీడియా స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం నాలుగురోజుల జరగనున్నది. ఈ వర్క్‌షాప్‌ను జీఎస్‌హెచ్‌ఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సన్నీ గోస్మాన్‌జోస్ లాంఛనంగా ప్రారంభించి, సాంకేతికత పరిజ్ఞానం మార్పునకు అనుగుణంగా, ముఖ్యంగా కంటెంట్ రైటింగ్ వృత్తిపై కృత్రిమ మేధస్సు ప్రభావాన్ని స్వీకరించడం ప్రాముఖ్యతను వివరించారు. కెరీర్ గైడెన్స్ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ మమతారెడ్డి మాట్లాడుతూ కొత్త సాంకేతికతలను స్వీకరించడంపై ప్రముఖంగా ప్రస్తావించారు. మొదటి సెషన్ రిసోర్స్ పర్సన్‌గా జియో మారియా పాల్గొని, కంటెంట్ రైటింగ్ ప్రాథమిక అంశాలు, కంటెంట్ రకాల, ఎస్ఈవో టెక్నిక్ వంటి కీలక అంశాలను విద్యార్థులకు పరిచయం చేశారు. తరువాతి రెండు సెషన్లలో కంటెంట్ కమ్యూనికేషన్, వ్యక్తిగత బ్రాండింగ్ వంటి వాటిని వివరించారు. ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ సయంతన్ మండల్, మీడియా స్టడీస్ విభాగాధిపతి ఎస్ఆర్ సంజీవ్‌కుమార్ తదితరులు ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

పథకాలు అనర్హులకు

(5వ పేజీ తరువాయి)

ఉండగా.. తండ్రులతో పాటే ఉంటున్న కుమారులకు ఆత్మీయ భరోసా దక్కింది. ప్రస్తుతం ఆ భూములను కుమారులే సాగు చేస్తున్నారు. ఎకరాకు రూ.కోటి పలుకుతున్నా ఏటా రూ.12వేల కోసం పోటీలు పడిన పరిస్థితి గ్రామాల్లో నెలకొన్నాయి. హైదరాబాద్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉంటున్నవారి పేర్లు జాబితాలో వచ్చాయి. జాబ్‌కార్డులు లేనివారికీ జాబితాలో పేర్లున్నాయి. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాపై మూడు జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇల్లున్నాయి... పేర్లొచ్చాయి

ఇందిరమ్మ ఇళ్ల జాబితాలపైనా వివాదాలు నడుస్తున్నాయి. ఇల్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వ పరంగా రూ.5 లక్షల సహాయం అందుతుంది. దీంతో సొంత ఇళ్లు, స్థలాలు ఉన్నవాళ్లంతా తప్పుడు సమాచారం ఇచ్చి జాబితాలో తమ పేర్లు వచ్చేలా ప్రయత్నం చేశారు. ఇందులో కొందరికి చోటు దక్కగా.. ఇంకొందరికి నిరాశ ఎదురైంది. మెజారిటీ గ్రామాల్లోనూ ఇళ్లున్న వారికే చోటు దక్కిందనే విమర్శలు వస్తున్నాయి. ఇంటి మంజూరు పత్రాలు పొందిన వారిలోనూ అనర్హులు బయటపడుతున్నారు. సిద్దిపేట అర్బన్ మండలంలోని ఒక చిన్న గ్రామంలో 10 మంది పేర్లు జాబితాలో ఉండగా.. ఎనిమిది మందికి సొంత ఇళ్లు ఉన్నాయనే ఆరోపణలు వచ్చాయి. ఇదే విధంగా పలు గ్రామాల్లో జాబితాలపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

ఫిర్యాదుల సెల్ అవసరమే

సంక్షేమ పథకాల జాబితాల్లో అనర్హులున్నారనే విషయం తెలిసి కూడా కొన్ని చోట్ల గ్రామస్థులు బయటకు చెప్పడం లేదు. ఇలాంటి అనర్హుల గురించి బయటచెబితే తమకు ఇబ్బందులు వస్తాయని భావిస్తున్నారు. అందుకే ఒక ఫిర్యాదుల సెల్ లేదంటే టోల్ ఫ్రీ నంబరును ఏర్పాటు చేస్తే అనర్హుల చిట్టా బయటపడుతుంది. అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసినప్పటికీ అనర్హుల జాడ తెలియకపోవచ్చు. కానీ ఆయా గ్రామస్థులకు పూర్తి వివరాలు తెలిసి ఉంటాయి. ఈ విషయంపై కలెక్టర్లు, ఉన్నతాధికారులు ఆలోచన చేయాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బహిరంగ ఫిర్యాదుల కంటే గుట్టుగా అనర్హులపై ఫిర్యాదులు చేయడం వల్లనే ఈ పథకాలు పారదర్శకంగా సాగుతాయనే వాదనలు వినిపిస్తున్నాయి.

క్రైం కార్నర్


లారీ ఢీకొని వ్యక్తి మృతి



వెంకటేశ్ మృతదేహం

వర్గల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : లారీ ఢీకొట్టడంతో ద్విచక్రవాహనదారుడు దుర్మరణం చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వర్గల్ మండలం నాచారం గ్రామానికి చెందిన కొత్తపల్లి వెంకటేశ్(48) తూప్రాన్‌కు వెళ్లి నాచారం గ్రామానికి తన ద్విచక్రవాహనంపై తిరిగి వస్తున్నాడు. అనంతగిరిపల్లి గ్రామ శివారు ప్రాంతంలోని తూప్రాన్ గజ్వేల్ రహదారి మూలమలుపు వద్దకు రాగానే గజ్వేల్ వైపు నుంచి వస్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో వెంకటేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పొలంలో జారిపడి యువ రైతు..



చేతన్ కుమార్ మృతదేహం

మాసాయిపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పొలంలో జారిపడి యువ రైతు మృతి చెందాడు. వెల్దుర్తి ఎస్ఐ రాజుగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మాసాయిపేట మండలం హకీంపేటకు గ్రామానికి చెందిన రైతు చేతన్ కుమార్(35) మంగళవారం ఉదయం తన పొలం గట్లు తిరుగుతూ నీరు పెడుతున్నాడు. ప్రమాదవశాత్తు జారి పొలంలో పడిపోయి బురదలో కూరుకుపోయి ఊపిరాడక మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజుగౌడ్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత..

రామచంద్రాపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన ఘటన కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్ కథనం ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన సర్వేరీయా కత్తూర్(20) జహంగీర్ ప్రేమించి వివాహం చేసుకున్నారు. ఏడాదిన్నర క్రితం ఈ దంపతులు స్థానికంగా ఉన్న సిగ్నిచర్ హోమ్స్ నిర్మాణ సంస్థలో పనిచేస్తూ లేబర్ షెడ్లలో నివాసముంటున్నారు. ఈ నెల 26వ తేదీ రాత్రి సర్వేరీయా కత్తూర్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. దీన్ని గమనించిన ఇరుగు పొరుగువారు గుర్తించి ఆమెను కిందకు దింపి కాపడారు. మరుసటి రోజు ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందిగా ఉందని చెప్పడంతో భర్త జహంగీర్ స్థానికంగా ఉన్న ప్రవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లాడు. చికిత్సకు ఎక్కువ డబ్బులు అవుతాయని ఆసుపత్రి వర్గాలు చెప్పడంతో అక్కడి నుంచి ఆమెను గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మంగళవారం మృతి చెందింది. భర్త నుంచి సమాచారం అందుకున్న పోలీసులు మృతురాలి తల్లిదండ్రులను విషయాన్ని చేరవేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దేవేందర్ తెలిపారు.

లింక్‌పై క్లిక్.. రూ.39 వేలు గల్లంతు

రామచంద్రాపురం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఫ్లిప్‌కార్ట్ నుంచి వచ్చిన లింకును ఓపెన్ చేయడంతో ఓ యువకుని బ్యాంకు ఖాతా నుంచి 30 సెకన్ల వ్యవధిలోనే రూ.39 వేలు గల్లంతయ్యాయి. దీంతో సదరు యువకుడు కొల్లూరు పోలీసులను మంగళవారం ఆశ్రయించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. భెల్ ఎంఐజీ ఫేజ్-2, విద్యుత్‌నగర్‌లో నివాసముంటున్న మహేశ్ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం అతని ఫోన్‌కు ఫ్లిప్‌కార్ట్ నుంచి లింక్‌లు వచ్చాయి. దాన్ని మహేశ్ పట్టించుకోలేదు. కుటుంబ సభ్యులు ఏదేని వస్తువు బుక్‌చేసి ఉంటారన్న తలంపుతో ఇంటికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నాడు. వారు ఎటువంటివి బుక్‌చేయలేదని తెలిపారు. దీంతో మహేశ్ తన ఫ్లిప్‌కార్ట్ అకౌంట్‌లో లాగిన్ అయి లింక్ ఓపెన్ చేసిచూడగా వెంటనే తన బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు డెబిట్ అయ్యాయి. బాధితుడి ఫిర్యాదుతో సీఐ రవీందర్ ఆదేశాల మేరకు ఎస్ఐ సురేశ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రామాయంపేట బైపాస్ వద్దేవద్దు

- అధికారులను అడ్డుకున్న భూ నిర్వాసితులు



అధికారులతో భూ నిర్వాసితుల వాగ్వాదం

రామాయంపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రామాయంపేటలో బైపాస్ వద్దే వద్దంటూ భూ నిర్వాసితులు మరో మారు అధికారులను అడ్డుకున్నారు. మంగళవారం మెదక్ రహదారిలో రోడ్లు, భవనాల శాఖ అధికారులు సర్వే కోసం వచ్చారు.ఈ విషయాన్ని తెలుసుకున్న రైతులు అక్కడికి చేరుకొని అధికారులతో ఘర్షణకు దిగారు. ఇక్కడ మరో బైపాస్‌కు తమ భూములు ఇచ్చేదే లేదని, సర్వే చేపట్టొద్దంటూ అడ్డుకోవడంతో అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు.

న్యూస్ బాక్స్

సొంత ఖర్చుతో కల్వర్టు నిర్మాణం

నారాయణఖేడ్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో మంగళవారం మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌స్వరూప్ షెట్కార్ సొంత ఖర్చుతో చిన్న పాటి కల్వర్టును నిర్మించారు. మురుగుకాల్వ పక్కన గోతులు ఏర్పడడంతో పాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కాలనీవాసులు ఆయన దష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఆయన కల్వర్టు నిర్మాణం చేయడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

మంచినీటి సమస్య తీర్చాలని వినతి

చేగుంట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : చేగుంట మండలం ఇబ్రహీంపూర్ గ్రామంలో మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని గ్రామస్థులు మంగళవారం మెదక్ ఈఈ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం మెదక్ ఎంపీ రఘునందన్‌రావును కూడా మెదక్‌లో కలిసి సమస్య తీర్చాలని విన్నవించారు. ఇందులో మాజీ సర్పంచ్ బెదరబోయిన నాగభూషణం, గ్రామస్థులు ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడాపోటీలు

తూప్రాన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29 నుంచి 31 వరకు తూప్రాన్ పట్టణంలో రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు, డీఈవో రాధాకిషన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగా రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 14 ఏళ్లలోపు బాల, బాలికలకు పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

అల్లర్లు సృష్టిస్తే ఊరుకోం

శివ్వంపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు ప్రొటోకాల్ పాటించకుండా అవగాహనారహితంగా సమావేశాల్లో అల్లర్లు సృష్టిస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని శివ్వంపేట మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ విమర్శించారు. మంగళవారం చిన్న గొట్టిముక్కలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు.

వైకుంఠధామంలో పారిశుధ్య పనులు

తూప్రాన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలో నిర్మించిన భారీ వైకుంఠధామంలో మున్సిపల్ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'అధ్వాన్నం.. వైకుంఠధామం' అంటూ కథనం ప్రచురితమైంది. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి వైకుంఠధామాన్ని సందర్శించారు. వెంటనే క్లీనింగ్ చేపట్టాలని ఆదేశించడంతో సిబ్బంది పనులు చేపట్టారు.

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

రామచంద్రాపురం టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ జగన్నాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా కారంచేడు మండలం ఆరెహుడి గ్రామానికి చెందిన బ్రిస్లి(20) రామచంద్రాపురం డివిజన్ పరిధి మయూరినగర్ కాలనీలో నివాసముంటున్నాడు. కొంతకాలంగా ఆర్థికంగా ఇబ్బందులుపడుతూ మనోవేదనకు గురవుతున్నాడు. మంగళవారం ఉదయం తల్లిదండ్రులు పరిశ్రమలో పనిచేయడానికి వెళ్లిన తర్వాత ఇంట్లో చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. తండ్రి కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీవితంపై విరక్తితో 75 ఏళ్ల వృద్ధురాలు..

రామాయంపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెందిన 75 ఏళ్ల వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. రామాయంపేట పట్టణంలోని చాకలి బస్తీకి చెందిన కోనాపూర్ పోషవ్వ కొంతకాలంగా దగ్గు, దమ్ముతో బాధపడుతోంది. తరచూ ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం తెల్లవారుజామున సమీప మల్లెచెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఆమె మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

మెదక్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని మంగళవారం చోటుచేసుకుంది. చిన్నశంకరంపేటకు చెందిన సిరిగద్దె సత్తయ్య మెదక్ చేగుంట రహదారిపై టీవీఎస్ ఎక్సల్‌పై ప్రయాణిస్తున్నాడు. వెనక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. కుటుంబీకులు చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థులకు శాస్త్రీయ అవగాహన ఉండాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



చిన్నశంకరంపేట మండలం ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు శాస్త్రీయ భావాలపై అవగాహన కలిగి ఉండాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో మంగళవారం (ఈడు-ఫైస్ట) కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించొచ్చన్నారు. పిల్లల్లో నైపుణ్యాలను వెలికితీసేందుకు విద్యార్థులు తయారుచేసిన వివిధ ప్రాజెక్టు నమూనాలను పాఠశాలలో ప్రదర్శించారు. 250 మంది నమూనాల ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వాణికుమారి, ఎఎపీసీ చెరికిస్ శ్రవంతి, మాజీ సర్పంచులు శ్రీమాన్‌రెడ్డి, రాజిరెడ్డి, ఉపసర్పంచ్ జీవన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే చిన్నశంకరంపేట పీహెచ్‌సీని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో కనీస సౌకర్యాలు, వసతులు కలిగి ఉండాలని సిబ్బందికి సూచించారు. ఆస్పత్రి స్థితిగతులపై వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు.

నిజమైన హీరోలు పోలీసులే: ఎస్పీ రూపేష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్, తదితరులు

జహీరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో నిజమైన హీరోలు పోలీసులేనని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటారని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఎస్‌కన్వెన్షన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హీరోలు సినిమాల్లో కొద్దిసేపు మాత్రమే మంచి పనులను చేస్తున్నట్లు కనిపిస్తారు.. కానీ పోలీసులు మాత్రం 24 గంటలపాటు ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రామ్మోహనరెడ్డి, సీఐలు శివలింగం, హన్మంతు, ఎంవీఐ వెంకటయ్య ఎస్ఐలు కాశీనాథ్, సతీష్, రాజశేఖర్, నరేష్, రాజేందర్‌రెడ్డి, ప్రసాదరావు, పోలీసులు,ఆయాపాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వాహనాల డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే పలువురు రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు ఎస్పీ చేత ఆర్థిక సహాయాన్ని అందజేశారు. రోడ్డు భద్రతా నియమాలు, యువతను చైతన్యం చేసే దిశగా, సెల్‌ఫోన్లతో సమాజంలో జరుగుతున్న నష్టం, తదితరాలపై పాటలు పాడినందుకు సామాజిక చైతన్య గాయకుడు ఆయుదాల సునీల్‌ను ఎస్పీ సన్మానించారు. ఇదిలా ఉండగా ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎం ప్రభులత పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ జాకీర్‌హుస్సేన్, బుధేర కళాశాల ప్రిన్సిపల్ మాధవి, అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆ రెండు గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేయండి

● మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిషోర్‌కు ఎమ్మెల్యే విజ్ఞప్తి



దానకిషోర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, తదితరులు

పటాన్‌చెరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అమీన్‌పూర్ మండలంలో కేవలం రెండు గ్రామ పంచాయతీలే మిగిలిపోడవడం వల్ల భవిష్యత్తులో పాలనాపరమైన చిక్కులు వస్తాయని, ఆ రెండు గ్రామాలను సైతం అమీన్‌పూర్ మున్సిపాలిటీలో విలీనం చేయాలని కోరుతూ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మంగళవారం మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిషోర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఇటీవలే మండల పరిధిలోని ఆరు గ్రామపంచాయతీలను అమీన్‌పూర్ మున్సిపాలిటీలో విలీనం చేశారన్నారు. రెండు గ్రామపంచాయతీలతో పాలనాపరమైన సమస్యలు తలెత్తే అవకాశంతో అభివృద్ధి కుంటుపడుందని గ్రామాల ప్రజలు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్యే ప్రతిపాదనకు దానకిషోర్ సానుకూలంగా స్పందించారు. మిగిలిన రెండు గ్రామాలపై అధ్యయనం చేసి నిర్ణయం తీసుకుంటామని హామీఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మాజీ జడ్పీటీసీ గంగుల సుధాకర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడితో పార్టీకి నష్టం



ఆది శ్రీనివాస్, జగ్గారెడ్డికి పరిస్థితిని వివరిస్తున్న కాంగ్రెస్ పటాన్‌చెరు నాయకులు

పటాన్‌చెరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు నియోజకవర్గంలో ఇటీవల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడితో కాంగ్రెస్‌కు తీరని నష్టం వాటిల్లుతోందని, కొందరి గ్రూపు రాజకీయాల వల్ల నిజమైన కార్యకర్తలు ఆవేదనతో ఉన్నారని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, పర్వ శ్యాంరావు, మతిన్‌బేగ్, కాంగ్రెస్ నాయకుడు, పీసీసీ నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, వినోద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, టీఎస్ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డిలకు వినతిపత్రాలు సమర్పించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేస్తున్న సమయంలో కాంగ్రెస్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణ ఓర్వలేక పక్కదారి పట్టించేందుకు ఈ విధమైన అలజడులు సృష్టిస్తున్నారన్నారు. బొల్లారం మున్సిపాలటీలో బీఆర్ఎస్ నాయకుడితో తలెత్తిన ప్రొటోకాల్ వివాదానికి క్యాంపు కార్యాలయంపై దాడిచేయడం ఆందోళన కలిగిస్తోందన్నారు.

హత్య కేసులో ఐదుగురికి రిమాండ్

హత్నూర, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని, భర్తను హత్య చేసిన కేసులో ఐదుగురు నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు జిన్నారం సీఐ నయిమోద్దీన్ తెలిపారు. మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కామారెడ్డి జిల్లా బిక్‌నూర్ మండలం మలుపల్లి గ్రామానికి చెందిన మాలే నారాయణ మూడేళ్లుగా హత్నూర మండలం రెడ్డిఖానాపూర్ గ్రామ శివారులోని రైతు ఉత్పత్తిదారుల సంస్థలో సీఈవోగా పనిచేస్తున్నాడు. భార్య మాలే లక్ష్మీనర్సవ్వ, ఇద్దరు పిల్లలు స్వగ్రామంలోనే ఉంటున్నారు. మృతుడి భార్య బిక్‌నూర్ మండలం రామేశ్వరంపల్లి గ్రామానికి చెందిన కడారి రాకేష్‌తో వివాహేతర సంబంధం ఏర్పర్చుకుంది. ఈ విషయం నారాయణకు తెలియడంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగి పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీలు నిర్వహించారు. తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను ఎలాగైనా తొలగించుకోవాలని భావించిన భార్య ప్రియుడు రాకేష్‌తో పాటు భిక్‌నూర్ మండల చెట్లపల్లి సాగర్, డప్పు శ్రీకాంత్, రామేశ్వరంపల్లి గ్రామానికి చెందిన కడారి శ్రీకాంత్ కలిసి ఈనెల 24న (టీఎస్ 07ఈడి 5231) నెంబరు గల కారులో నారాయణ నివాసముంటున్న రెడ్డిఖానాపూర్ సంస్థ భవనం వద్దకు చేరుకున్నారు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం.. అదేరోజు రాత్రి గొంతు కోసి, కట్టె, రాడ్లతో దాడిచేసి హత్య చేశారు. ఆ తర్వాత నారాయణ మృతదేహంతో పాటు మోటార్ సైకిల్‌ను తీసుకెళ్లి పల్పనూర్ సమీపంలోని ముళ్లపొదల్లో పడవేసినట్లు నిందితులు ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. దీంతో మృతుడి భార్య మాలే లక్ష్మీనర్సవ్వ, నిందితులు కడారి రాకేష్, చెట్లపల్లి సాగర్, కడారి శ్రీకాంత్, డప్పు శ్రీకాంత్‌ను అరెస్టు చేసి, కోర్టులో ప్రవేశపెట్టగా.. రిమాండ్ విధించినట్లు తెలిపారు. నిందితులు ఉపయోగించిన కారు, రాడ్లు, కత్తి, కర్రను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డు పనులను వేగవంతం చేయండి

● హెచ్ఎండీఏ కమిషనర్‌తో ఎంపీ

రామచద్రాపురం టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : గత దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) సర్వీసు రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను మెదక్ ఎంపీ రఘునందన్‌రావు కోరారు. ఈ మేరకు మంగళవారం కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. కొల్లూరు ఓఆర్ఆర్ ఎగ్జిట్-2 సర్వీసు రోడ్డు కోసం 2.27 ఎకరాల భూమిని సేకరించాలన్నారు. అలాగే అసంపూర్తిగా ఉన్న రైల్వే బ్రిడ్జిని పూర్తిచేయడం వల్ల ప్రయాణికులకు ప్రయాణం సులభతరం అవ్వడంతో పాటు సమయం కలిసి వస్తుందన్నారు. సర్వీసు రోడ్డు పూర్తయితే కొల్లూరు, ఈదులనాగులపల్లి, తెల్లాపూర్ వాసుల ప్రయాణాల దూరాలు తగ్గుతాయన్నారు. ప్రభుత్వాలు టోలు వసూళ్లలో చూపిన శ్రద్ధ రోడ్డు నిర్మాణంలో చూపితే ప్రజలకు ప్రయాణ భారం తగ్గుతుందన్నారు.

ఎమ్మెల్యే రాజకీయ లబ్ధికి యత్నించడం సిగ్గుచేటు

● పీసీసీ ప్రధాన కార్యదర్శి, డీసీసీ అధ్యక్షుడు, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్



విలేకరులతో మాట్లాడుతున్న రాజిరెడ్డి, ఆంజనేయులుగౌడ్, సుహాసినిరెడ్డి

నర్సాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ ముఖ్య నాయకుల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందాలని స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రయత్నించడం సిగ్గుచేటని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి విమర్శించారు. మంగళవారం నర్సాపూర్‌లోని ఆవుల రాజిరెడ్డి క్యాంపు కార్యాలయంలో ముగ్గురు విలేకరులతో మాట్లాడారు. సునీతారెడ్డికి తన రాజకీయ లబ్ధి తప్పా.. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సమస్యలు పట్టవన్నారు. ఇదిలా ఉండగా రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా సాటి మహిళ చూడకుండా సుహాసినిరెడ్డి పట్ల ఎమ్మెల్యే వ్యవహరించిన తీరు విచారకరమని రాజిరెడ్డి, ఆంజనేయులుగౌడ్ అన్నారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ శ్రీనివాసగుప్తా, పార్టీ మండల అధ్యక్షులు మల్లేశం, శ్రీనివాస్‌రావు, నరేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అంజిగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రిజ్వాన్, నాయకులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

● కబడ్డీ అసోసియేషన్ మెదక్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

పాపన్నపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని కబడ్డీ అసోసియేషన్ మెదక్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన పాపన్నపేటలో మంగళవారం రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడాకారుల ఎంపిక జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇందులో సీనియర్ మెన్స్ సబ్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ క్రీడాకారుల ఎంపిక కొనసాగింది. సీనియర్ మెయిన్స్ విభాగంలో ఆసిఫ్, నిఖిల్, రాకేష్, పవన్, మేఘరాజ్, సిద్ధిరాములు, వికాస్, ప్రకాష్, లోకేష్, నరేందర్ సాయి నిహాల్, చంటి, శివకుమార్, సుమిత్ర అశ్వినితో పాటు పలువురు ఎంపికైనట్లు పీడీ రమేష్ వెల్లడించారు. నరేందర్ గౌడ్, సాయినాథ్‌రావు దాతలుగా వ్యవహరించగా.. అసోసియేషన్ సభ్యులు గోపాల్, కుమార్, రవి, శ్రీకాంత్, శివ, శశి, ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్, హెచ్ఎం మహేశ్వర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీకి విద్యార్థులు

వట్‌పల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అండర్-15 కేటగిరీలో జిల్లాస్థాయిలో నిర్వహించిన రబ్బీ క్రీడల్లో వట్‌పల్లి మండలం ఖాదిరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి తెలిపారు. పాఠశాలకు చెందిన సీ.హెచ్ బన్ని, పి.నర్సింలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికకావడంపై పాఠశాల పీఈటీ సంగ్రామ్, ఉపాధ్యాయులు అభినందించారు.


మున్సిపల్ పరిధిలోకి గుమ్మడిదల

● మున్సిపల్ కమిషనర్‌గా జి.రఘు

గుమ్మడిదల/జిన్నారం/కోహీర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో గుమ్మడిదల అనుబంధ గ్రామాలు మున్సిపల్ పరిధిలోకి చేరాయి. ఈ సందర్భంగా మంగళవారం మున్సిపల్ అధికారులు కీలక చర్యలు తీసుకున్నారు. గుమ్మడిదల, బొంతపల్లి, వీరన్నగూడెం, దోమడుగు, అన్నారం పంచాయతీలకు సంబంధించిన రికార్డులను అధికారికంగా స్వాధీనం చేసుకున్నారు. మున్సిపల్ పరిపాలనను పర్యవేక్షించేందుకు కమిషనర్‌గా జి.రఘు బాధ్యతలు చేపట్టారు. జిన్నారం మండలం గడ్డపోతారం నూతన మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్‌గా మంగతాయారు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. నూతన మున్సిపాలిటీలో చేరిన వావిలాల, లక్ష్మీపతిగూడెం, మాదారం, కాజీపల్లి పరిధిలో ఇక మున్సిపల్ పాలన జరుగనున్నది. కోహీర్ మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉమామహేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన కొత్తగా ఏర్పడిన కోహీర్ మున్సిపల్‌కు అదనపు బాధ్యతలు తీసుకున్నారు. జహీరాబాద్ మున్సిపల్‌లోనే టీపీవో, ఏఈ, అకౌంట్స్ ఆఫీసర్‌లుగా విధులు నిర్వహిస్తున్న నరేష్, హరీష్, లక్ష్మికి కోహీర్ మున్సిపాలిటీలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. మేజర్ గ్రామపంచాయతీగా కొనసాగిన కోహీర్‌ను గ్రామస్థుల కోరిక మేరకు 50 ఏళ్ల తర్వాత మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. మంగళవారం పలు రికార్డులను పంచాయతీ కార్యదర్శి మున్సిపల్ కమిషనర్‌కు అప్పగించారు. ఇక కోహీర్‌లో పురపాలక పాలన ప్రారంభమైంది.

గద్దర్ చరిత్ర తెలియని బండి సంజయ్

● అవాకులు, చెవాకులు పేలితే ఊరుకునేది లేదు: మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్



కాంగ్రెస్ నాయకులను బీఆర్ఎస్‌లోకి చేర్చుకుంటున్న క్రాంతికిరణ్

జోగిపేట/సంగారెడ్డి రూరల్/వట్‌పల్లి/తూప్రాన్/నర్సాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : గద్దర్ చరిత్ర తెలియని మూర్ఖుడు బండి సంజయ్ అని అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. మంగళవారం ఆయన జోగిపేటలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గద్దర్ గురించి ఏమాత్రం తెలియని బండి సంజయ్ సోయి తప్పి, మతిలేని మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆర్ఎస్ఎస్ నుంచి ఆర్‌శ్రీసియా దాకా అన్నిరకాల భావజాలాల వ్యక్తులను కలగలిపి తెలంగాణ ఉద్యమంలో అందరినీ కలుపుకుని పోయిన గొప్ప వ్యక్తి గద్దర్ అని అన్నారు. గద్దర్ గురించి ఏమాత్రం తెలియని బండి సంజయ్ తమ కార్యకర్తలను చంపాడని ఆరోపించడం మూర్ఖత్వమేనన్నారు. కాగా అందోలు-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డుకు చెందిన పలువురు కాంగ్రెస్ దాసరి మల్లేశం, ఎలగోరి నరేశ్, కుమ్మరి అశోక్, బోయిని అశోక్, బద్రి లక్ష్మణ్ క్రాంతి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. గద్దర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బీరయ్యాయాదవ్ డిమాండ్ చేశారు. గద్దర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సంగారెడ్డిలోని ఐబీ నుంచి కొత్త బస్టాండ్ వరకు కేంద్ర మంత్రి బండి సంజయ్ శవయాత్ర నిర్వహించి దిష్టిబొమ్మ దహనం చేశారు. వట్‌పల్లిలో అందోల్ నియోజకవర్గ అంబేడ్కర్ యువజన సంఘాల ప్రధాన కార్యదర్శి దాసు, కేవీపీఎస్ మండల అధ్యక్షుడు బి.జనార్దన్, బీఆర్ఎస్ వట్‌పల్లి గ్రామ అధ్యక్షుడు మధు ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. తూప్రాన్ పట్టణంలో పాత హైవే రోడ్డుపై ఆర్టీసీ బస్టాండ్ వద్ద దళిత సంఘాల నాయకులు శ్రీనివాస్‌రావు, నర్సాపూర్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం చేశారు.

ఎస్ఎన్‌టీ నుంచి సికింద్లాపూర్ రోడ్డుకు రూ.5.37 కోట్లు

నర్సాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ నియోజకవర్గంలోని ఎస్ఎన్‌టీ రోడ్డు నుంకి సికింద్లాపూర్ వయా రుస్తుంపేటకు బీటీరోడ్డు కోసం రూ.5.37 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే సునీతారెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ నర్సాపూర్ సమీపంలోని సంగారెడ్డి ప్రధాన రోడ్డు నుంచి సికింద్లాపూర్ వరకు వయా రుస్తుంపేట, మూసాపేట మీదుగా ఉన్న 9.53 కిలోమీటర్ల మేర రోడ్డును బీటీగా మార్చడం వల్ల నర్సాపూర్, హత్నూర మండలాలతో పాటు ఆ రోడ్డు మార్గంలో ఉన్న గ్రామాలకు, జోగిపేటకు వెళ్లేందుకు అనువుగా ఉంటుందన్నారు.

చౌటకూర్ మండల ప్రజాపరిషత్‌కు సిబ్బంది నియామకం

● ఇన్‌చార్జి ఎంపీడీవోగా రామలింగం



ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న రామలింగం

పుల్‌కల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : చౌటకూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి అధికారులు, సిబ్బందిని కేటాయిస్తూ కలెక్టర్ వల్లూరు క్రాంతి ఉత్తర్వులు జారీచేశారు. మునిపల్లి ఎంపీడీవో కార్యాలయ పర్యవేక్షకుడు బి.రామలింగంను అర్డర్ టూ సర్వ్ కింద చౌటకూర్ ఎంపీడీవోగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయనతో పాటు ఒక టైపిస్టు, ఇద్దరు ఆఫీస్ సబార్డినేట్లను కూడా అర్డర్ టూ సర్వ్ కింద నియమిస్తూ ఉత్తర్వులు వెలువరించారు. ఈ మేరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా రామలింగం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. చౌటకూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి పర్యవేక్షకులు, సీనియర్, జూనియర్ సహాయకుల పోస్టులను నియమిస్తే ఇక పూర్తిస్థాయిలో కార్యకలాపాలు కొనసాగనున్నాయి.

తెలంగాణ డాక్టర్స్ క్రికెట్ లీగ్ సీజన్-2

సంగారెడ్డి అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ)మంజీర బ్రాంచ్ ఆధ్వర్యంలో వచ్చేనెల 8, 9వ తేదీల్లో సంగారెడ్డి పట్టణం, కోనాపూర్‌లో తెలంగాణ డాక్టర్స్ క్రికెట్ లీగ్ సీజన్-2 నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్, జెర్సీలను కలెక్టర్ వల్లూరు క్రాంతి మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. ఐఎంఏ స్పోర్ట్స్ మీట్‌ను విజయవంతం చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ వైద్యులు డా.చక్రపాణి, హరినాథ్‌రెడ్డి, మోతీలాల్, భరత్, శ్రావణ్, సందీప్, కిరణ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కాజీపల్లిలో అక్రమ కట్టడాల కూల్చివేత

జిన్నారం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలం కాజీపల్లి ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ కట్టడాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. మంగళవారం కాజీపల్లి 181 సర్వే నెంబరులో ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన గదులు, బెస్మెట్లు, ఇతర నిర్మాణాలను ఆర్ఐ జయప్రకాష్‌నారాయణ, రెవెన్యూ సిబ్బంది జేసీబీలతో కూల్చివేయించారు. కాగా ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు జరిపితే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ భిక్షపతి హెచ్చరించారు.

'ప్రయాణికుల క్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలి'

నారాయణఖేడ్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే డ్రైవర్లు లక్ష్యంగా పెట్టుకోవాలని డీఎస్పీ వెంకట్‌రెడ్డి సూచించారు. జాతీయరోడ్డు భద్రతా మాసోత్సవంలో భాగంగా మంగళవారం ఖేడ్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్లతో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ శ్రీశైలం, డీఎం మల్లేశయ్య పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో 'వేల గొంతుక- లక్ష డప్పుల' సభ

● ఎమ్మార్పీఎస్ కొత్తపల్లి అధ్యక్షుడు మాదాసు మాదిగ

హవేళిఘణపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే 'వేల గొంతుక- లక్ష డప్పుల' సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ కొత్తపల్లి అధ్యక్షుడు దాసు మాదిగ కోరారు. మంగళవారం కొత్తపల్లిలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దాసుమాదిగ, ఉపాధ్యక్షుడిగా ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా మనోజ్, ప్రచార కార్యదర్శిగా సాయిలు, కోశాధికారిగా మైపాల్‌ను జిల్లా అధ్యక్షుడు శేఖర్ మాదిగ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ ఎంప్లాయీస్ జాతీయ కార్యదర్శి అనంతరావు, జిల్లా కార్యదర్శి రమేష్, మాజీ వైస్ ఎంపీపీ శంకర్ పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన భూమిలో హెచ్చరిక బోర్డు

మెదక్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ఆక్రమణకు గురైన కొత్తకుంట శిఖం భూమిలో ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు మంగళవారం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. 363 సర్వే నెంబర్ గల కొత్తకుంట శిఖం భూమిలోని 13 ఎకరాలను కొంతమంది ఆక్రమించి ప్లాట్ల రూపంలో అమాయక ప్రజలకు విక్రయిస్తున్న విషయమై 'ప్రభుత్వ భూమి కుంట కబ్జా' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఈ మేరకు అధికారులు స్పందించారు. అదనపు కలెక్టర్, ఇరిగేషన్ డీఈఈ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు భూమికి ఇరువైపులా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఇందులో ఇరిగేషన్ ఏఈ ప్రదీప్‌రెడ్డి, ఆర్ఐ, ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


యూజీసీ పే స్కేల్స్ అమలు చేయాలి

● సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూలో ఒప్పంద అధ్యాపకుల నిరసన

పుల్‌కల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): యూజీసీ పేస్కేల్స్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఒప్పంద అధ్యాపకులు మంగళవారం నిరసన తెలిపారు. తెలంగాణలోని 12 యూనివర్సిటీల్లో 1,445 మంది ఒప్పంద అధ్యాపకులుగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని ఒప్పంద అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ జె.సాయిచంద్ర తెలిపారు. ఉన్నత చదువులు చదివి యూనివర్సిటీనే నమ్ముకుని చాలీచాలని జీతానికి పనిచేస్తూ కుటుంబాలను పోషిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే యూజీసీ పే స్కేల్స్‌ను అమలు పరచి ఉద్యోగ, భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆలయ కమిటీ చైర్మన్‌గా బాల్‌రెడ్డి

● రైతు సంఘం అధ్యక్షుడిగా సదానందరెడ్డి



బాల్‌రెడ్డి, సదానందరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

గుమ్మడిదల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల ఆలయ కమిటీ చైర్మన్‌గా మద్దుల బాల్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడిగా అమ్మగారి సదానందరెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని గ్రామస్థులు సన్మానించారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆలయ అభివృద్ధికి, రైతు సంఘం అభివృద్ధి కోసం శాయశక్తులా కృషి చేస్తామని మద్దుల బాల్‌రెడ్డి, అమ్మగారి సదానందరెడ్డి తెలిపారు.

దక్షిణ భారత సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థుల ప్రతిభ

మెదక్ కల్చరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పాండిచ్చేరిలో ఈ నెల 21 నుంచి 25 వరకు జరిగిన దక్షిణ భారత సైన్స్ ఫెయిర్-2025లో మెదక్ జిల్లా మాంబోజిపల్లి గీత పాఠశాల విద్యార్థినులు యుమ్న, హరిణి తయారుచేసిన (బయో ప్లాస్టిక్) ప్రాజెక్టుకు ఐదోస్థానం లభించింది. అంజనశ్రీ, మనూష తయారుచేసిన (ఫుడ్ అడల్ట్రేషన్ డిటెక్టర్) ప్రాజెక్టుకు స్పెషల్ జ్యూరీ అవార్డు లభించింది. ఈ అవార్డును పాండిచ్చేరి విశ్వవిద్యాలయ ప్రిన్సిపల్ చేతులమీదుగా స్వీకరించారు.